క్లుప్తంగా

పోషకాహారంతో ఆరోగ్యం



సీమంతం నిర్వహిస్తున్న పండరీబాయి తదితరులు

కుల్కచర్ల: గర్భిణులు, బాలింతలు ప్రతీరోజు పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చని కామునిపల్లి అంగన్‌వాడీ టీచర్ పండరీబాయి పేర్కొన్నారు. శుక్రవారం పోషణ మాసోత్సవంలో భాగంగా గర్భిణీకి సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు వైద్యులు సూచించిన విధంగా ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దీంతో సుఖ ప్రసవం జరగడంతో పాటుగా పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా పుడుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు అండగా ఉంటా



ఆర్థిక సహాయం చేస్తున్న సేవాలాల్ సేన నాయకులు

కుల్కచర్ల: గిరిజనులకు అండగా ఉంటానని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు శంకర్ నాయక్ అన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండలం దాస్యనాయక్ తండాలో రెండురోజుల క్రితం మృతిచెందిన సోంలిబాయికి నివాళులర్పించి వారి కుటుంబానికి సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి అజయ్ నాయక్ ఆధ్వర్యంలో రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారి పూజలో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

కుల్కచర్ల: మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో రెండురోజుల నుంచి కొనసాగుతున్న వనంల ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ముగింపు కార్యక్రమంలో భాగంగా అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి సాయంత్రం బోనాలు సమర్పించారు. గ్రామస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఉత్సవాలలో పాల్గొని పూజలు నిర్వహించారు. ప్రతిఒక్కరూ భక్తిభావంతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, నిర్వాహకులు గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి



ప్రత్యేక పూజలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి తదితరులు

పరిగి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కాళ్లాపూర్‌తండాలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలని సూచించారు. భక్తి మార్గంతోనే ముక్తి లభిస్తుందన్నారు. ముఖ్యంగా యువత భక్తి మార్గాన్ని ఎంచుకోవడంతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. ఆధ్యాత్మిక చింతన కలిగిన వారు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారన్నారు. అంతే కాకా సన్మార్గంలో నడుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు తౌర్యనాయక్, మండల వర్కింగ్ ప్రసిడెంట్ పులిందర్, జిల్లా నాయకులు మాధవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పగలే వెలుగుతున్న వీధి దీపం

- విద్యుత్ వృథా
- పట్టించుకోని అధికారులు

నవాబుపేట: విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని ఉచిత సలహాలు ఇచ్చే విద్యుత్ అధికారులు గ్రామాల్లో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. మండల పరిధిలోని లింగంపల్లి, ఎల్లకొండ, పులుమామిడి, నారెగూడ, పూలపల్లి తదితర గ్రామాల్లో సర్పంచులు విద్యుత్ స్తంభాలు వేయించి వీధి దీపాలు ఏర్పాటు చేయించారు. కానీ వాటికి ఆన్‌ఆఫ్ స్విచ్‌లు విద్యుత్ అధికారులు అమర్చలేదు. దీంతో అవి పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్ వృథా అవుతుందని ప్రభుత్వానికి రూ. వేలల్లో నష్టం వాటిల్లుతుందని స్థానికులు వాపోతున్నారు. వీధి దీపాలు సక్రమంగా పనిచేయకపోవడంతో కాలి పోతున్నాయి. దీంతో పంచాయతీలకు నెలనెల రూ. వేలల్లో బిల్లులు వస్తున్నాయని చెబుతున్నారు. అయినప్పటికీ వాటిని సరిచేయాలని విద్యుత్ అధికారులకు శ్రద్ధ ఉండడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలకు ఆన్‌ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేయించాలని ఆయా గ్రామల ప్రజలు కోరుతున్నారు.



పులుమామిడిలో వెలుగుతున్న వీధి దీపం

మహిళా సంఘాల అభివృద్ధికి కృషి



మహిళా సంఘాల భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మహిళలు, కాంగ్రెస్ నాయకులు

కొడంగల్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రశాంత్

దుద్యాల్: ప్రభుత్వం మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేస్తుందని కొడంగల్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రశాంత్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో రూ.30 లక్షలతో మహిళా సంఘాల భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలనే ఉద్దేశ్యంతో అనేక రకాల పథకాలు అమలు చేస్తుందన్నారు. ఉచిత బస్సుతో మహిళలు ఎంతో సంతోషంగా ఉన్నారని గుర్తు చేశారు. అలాగే వ్యాపార రంగాల్లో మహిళలు రాణించాలని వ్యాపార అవకాశాలు కల్పిస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు భీములు, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మల్లేశ్, నాయకులు, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా భద్రేశ్వరస్వామి ఉత్సవాలు



పుర వీధుల్లో స్వామి వారి పల్లకీ సేవ

తాండూరు: తాండూరు పట్టణంలోని భావిగి భద్రేశ్వరస్వామి దేవాలయ జాతరోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి మూడో రోజు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి వారికి ఉదయం సుప్రభాత సేవ, అభిషేకం, పుష్పార్చన, మధ్యాహ్నం 12 గంటలకు హారతి అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి 10 గంటలకు స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయం నుంచి పల్లకీలో పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. ఈ ఉత్సవాలను ఆలయ కమిటీ చైర్మన్ పటేల్ కిరణ్‌కుమార్‌తో పాటు దేవాదాయ శాఖ ఈఓ శేఖర్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. మరోవైపు కర్ణాటక నుంచి వచ్చిన పురంతయ్యల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామి వారి పల్లకీ సేవలో పాల్గొన్నారు.



స్వామి వారికి హారతి ఇస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ పటేల్ కిరణ్‌కుమార్ తదితరులు

నాణ్యమైన వరిధాన్యం విక్రయించాలి



బొంరాస్‌పేట: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట: రైతులు కొనుగోలు కేంద్రాల్లో నాణ్యమైన వరిధాన్యం విక్రయించాలని, దీంతో సన్న బియ్యం తయారవుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లిలో రైతు వేదికలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, రైతులకు ఇబ్బందులు రానియొద్దని సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు సరైన తేమశాతం పరిశీలించుకొని విక్రయానికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, నాయకులు నర్సింలుగౌడ్, రాంచంద్రారెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



దోమ: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వ్యవసాయ అధికారులు

దళారులను నమ్మి మోసపోకండి

దోమ: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని మండల వ్యవసాయ విస్తరణ అధికారి శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం దోమ మండల పరిధిలోని రాకొండ గ్రామంలో డీసీఎమ్మెఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని రైతులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తుందని, ప్రతీ రైతు అధికారులు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



బంట్వారం చర్చిలో ప్రార్థన చేస్తున్న మహిళలు

బంట్వారం: గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని క్రైస్తవులు బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మానవాళి పట్ల ప్రేమ, నిస్సహాయులపై కరుణ, శత్రువులపై క్షమ, ఆకాశమంతటి సహనం, అవధుల్లేని త్యాగమన్నారు. జీసస్ జీవితం మానవాళికి ఇచ్చిన సందేశమని పేర్కొన్నారు. మత పెద్దలు, పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.



అనంతగిరి: ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

అనంతగిరిలో..

అనంతగిరి: వికారాబాద్ పట్టణం, మండలంలోని ఆయా చర్చిల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే పురస్కరించుకుని క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు ఏసు క్రీస్తు గొప్పతనం, గుడ్‌ఫ్రైడే గురించి భక్తులకు వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరిగి: విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ హరిక్రిష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా పరిగి సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు, మున్సిపల్ పరిధిలోని అన్ని గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు ఆయన తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య



పాఠశాల వార్షికోత్సవంలో అధికారులు, ఉపాధ్యాయులు

కుల్కచర్ల: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యా బోధన చేపడుతున్నారని కుల్కచర్ల మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్, బాలానగర్ ఎంఈఓ హరిశ్చందర్ పేర్కొన్నారు. పుట్టపహడ్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం రాత్రి వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లోని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కవిత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవుజానాయక్, స్థానికులు ఆంజనేయులు, శ్రీశైలం, రాజశేఖర్ గౌడ్, యాదయ్య, లక్ష్మి, నరేందర్, కృష్ణయ్య, శేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

మొయినాబాద్‌రూరల్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మాజీ ఎంపీపీ అనిత, హిమాయత్‌నగర్ సాయిబాబా దేవాలయ చైర్మన్ శ్రీహరియాదవ్ పేర్కొన్నారు. స్థానిక సాయిబాబా ఆలయ 6వ వార్షికోత్సవాన్ని శుక్రవారం వేదపండితులు, పూజారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ అనిత, ఆలయ చైర్మన్ శ్రీహరియాదవ్, అఖిల భారత యాదవ సంఘం కార్యవర్గ సభ్యుడు రవియాదవ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలతో సాయినాథుడికి మహామంగళ హారతి సమర్పించారు. భక్తులకు స్వామి వారి దర్శనంతో తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు స్వప్నసతీష్, స్వామి, మహేందర్‌ముదిరాజ్, కుమార్‌యాదవ్, యాదయ్య, శ్రీకాంత్,ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మల్లేష్, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్త

షాబాద్: పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని రేగడిదోస్వాడ, షాబాద్ పశువైద్యాధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, స్రవంతి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కుమ్మరిగూడ, మాచన్‌పల్లి గ్రామాల్లో ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పశువులకు గ్రామాల్లో వచ్చే నెల 13 వరకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బలరాం, అంజయ్య, రాణి, శ్రీకాంత్, సాయి, తదితరులున్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

శంకర్‌పల్లి: మండలంలోని టంగటూర్ గ్రామంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాండురంగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్, కార్యదర్శిగా రాముని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను పార్టీ మండలాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డిలు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, మహిపాల్ రెడ్డి, యాదిరెడ్డి, రాజిరెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

పరిగి ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేసిన బీజేపీ నేతలు

కుల్కచర్ల: ప్రధాని మోడీపై అనుచిత వాఖ్యలు చేసి, దిష్టిబొమ్మ దహనం చేస్తే సహించమని, అలాంటి వారిపై కేసు నమోదు చేయాలని కేంద్ర టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు ఘణపురం వెంకటయ్య, కుల్కచర్ల మండల బీజేపీ అధ్యక్షుడు వెంకటయ్య ముదిరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డిపై వారు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రజాస్వామ్య వ్యవస్థలో విమర్శించుకోవడం సాధారణమేనన్నారు. కానీ ఇతరుల మనోభావాలను కించపరచడం, దేశ ప్రధాని నరేంద్రమోడీని దూషించిన వారిని శిక్షించాలన్నారు. అందులో పాల్గొన్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి హన్మంతు, నాయకులు యాదయ్య, చంద్రలింగం, రాంచంద్రయ్య, కొండ ఆంజనేయులు, మహేశ్, పోమాల నరేశ్, హరీశ్, సంతోష్, హరికృష్ణ, దస్తయ్య, తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నేతలు

కాంగ్రెస్ నేతలు ధర్నా చేయడం సిగ్గుచేటు

దోమ: నేషనల్ హెరాల్డ్ కుంభకోణంలో తమ నేతలు ఎలాంటి అవినీతికి పాల్పడలేదని కాంగ్రెస్ నేతలు ధర్నాలు చేపట్టడం సిగ్గుమాలిన చర్య అని బీజేపీ మండల అధ్యక్షుడు మల్లేశ్ మండిపడ్డారు. హెరాల్డ్ పత్రికతో పాటు సంబంధిత ఆస్తులను రాహుల్, సోనియాగాంధీ డొడ్డిదారిన ఓ రియల్ ఎస్టేట్ కంపెనీకి బదలాయించిందని బీజేపీ నేతలు ఆరోపించిన నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు ధర్నా చేపట్టారు. కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. భారత ప్రధాని మోదీ దిష్టి బొమ్మ దహనం చేశారు.



దోమ: కాంగ్రెస్ నేతలపై ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నేతలు

కాంగ్రెస్ నేతల చర్యలతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయనే కారణంతో శుక్రవారం దోమ పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలపై ఫిర్యాదు చేశామన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడారు. ..దేశ చరిత్రలో ఎన్నో సార్లు అవినీతి, అక్రమాలకు పాల్పడిన కాంగ్రెస్..అదే తీరులో రూ.వేల కోట్లు నేషనల్ హెరాల్డ్ కుంభకోణానికి పాల్పడితే దానిని కాంగ్రెస్ సమర్థిస్తూ మోదీ దిష్టి బొమ్మ దహనం చేయడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యేతో పాటు ఆయా నేతలపై వెంటనే కేసులు నమోదు చేయాలని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

నష్టపోయిన పంటలకు పరిహారం

ధారూరు: వడగండ్ల వానకు నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. దెబ్బతిన్న పంట పొలాలను వారు సందర్శించారు. ధారూరు మండల పరిధిలోని నాగసమందర్, అల్లాపూర గ్రామాల్లో గురువారం సాయంత్రం వడగండ్ల వాన కురిసింది. దీంతో వరి పొలాల్లో గింజలు రాలిపోయాయి. రైతులకు నష్టం వాటిల్లింది. గింజలు రాలిన వరి కంకుల్ని తీసుకుని బీజేపీ నాయకులు శుక్రవారం పరిశీలించారు. అక్కడి రైతులతో మాట్లాడారు. వరి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, ఎకరాకు రూ. 25వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ సీనియర్ నాయకుడు పండుగౌడ్, మండల అధ్యక్షుడు రాజునాయక్, వికారాబాద్ అసెంబ్లీ కో ఆర్డినేటర్ నందు, జిల్లా ఉపాధ్యక్షుడు వివేకానందరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రాజేందర్‌గౌడ్, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



నేలరాలిన వరి పంటను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

బీఆర్‌ఎస్ సభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నరేందర్ రెడ్డి తదితరులు

దుద్యాల్: ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కొడంగల్‌లో ఏర్పాటు చేసిన సన్నహాక సభలో చలో వరంగల్ పోస్టర్‌ను కొడంగల్, దుద్యాల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట్ మండలాలకు చెందిన ముఖ్య నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, దుద్యాల్ అధ్యక్షుడు చాంద్‌పాషా, నాయకులు మధుసూదన్ యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, నరేశ్ గౌడ్, లగచర్ల సురేశ్, ముక్తార్, సురేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

- ముస్లింలకు వ్యతిరేకంగా వ్యవహరించడం బాధాకరం
- మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యుడు మీర్ మోహమూద్ అలీ

పరిగి: కేంద్రంలో బీజేపీ ముస్లింలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యుడు మీర్ మోహమూద్ అలీ పేర్కొన్నారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ కమిటీ బోర్డు పిలుపు మేరకు శుక్రవారం పట్టణ కేంద్రంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలకు వ్యతిరేకంగా ఈ బిల్లును కేంద్రం తీసుకువచ్చిందన్నారు. వక్ఫ్ అంటేనే ప్రార్థన స్థలమని దీనిపై కేంద్రం వ్యతిరేకంగా బిల్లును తీసుకురావడం బాధాకరమన్నారు. వక్ఫ్ బోర్డు సవరణకు మద్దతు ఇచ్చిన ఆయ పార్టీలను ముస్లింలు క్షమించరని హెచ్చరించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందని ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఊరుకోమని బీజేపీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మైనార్టీలకు ముప్పుగా భావించే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును దేశంలోని ముస్లింలు వ్యతిరేకిస్తున్నారన్నారు. కేంద్రం వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సంఘాల నాయకులు, మసీద్ కమిటీ సదర్ మోయిజ్, నాయకులు తాహెర్ అలీ, బషీర్ తదితరులు పాల్గొన్నారు.



మర్పల్లిలో ముస్లింల ర్యాలీ

మర్పల్లిలో..

మర్పల్లి: వక్ఫ్ సవరణ చట్టాలను వెంటనే రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం మర్పల్లిలో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగిన ఈ ర్యాలీలో ముస్లిం మత పెద్దలు, ఆయా పార్టీల మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పరిగి: ర్యాలీలో ముస్లింలు